www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 9 ఏప్రిల్ 2023

## యువతకు నైపుణ్యం అవసరం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

యువతకు డిగ్రీలున్నా నైపుణ్యం ఎంతో అవసరమని, వారి కోసమే బిల్డింగ్ పర్సనాలిటీ అండ్ ఎంప్లాయ్‌బులిటి స్కిల్స్ అనే అంశంపై పుస్తకాన్ని తీసుకొచ్చామని డాక్టర్ షేక్ సులేమాన్ తెలిపారు. శనివారం ఆయన ఆ పుస్తకాన్ని ఆవిష్కరించి వివరాలు వెల్లడించారు. నిరుద్యోగ యువత ఏ నైపుణ్యాలను అలవర్చుకోవాలో, అభివృద్ధి చేసుకోవాలో ఈ పుస్తకంలో పొందుపర్చానని, నేడు డిగ్రీలున్నా నైపుణ్యం లేకపోతే ఉద్యోగం సంపాదించడం కష్టమేనని అన్నారు. ఈ పుస్తకం ద్వారా స్కిల్స్‌ను పెంపొందించుకుని ఉద్యోగాలు సాధించవచ్చునని అన్నారు. ప్రస్తుతం ఉచితంగా రెండు వేల మందికి ఈ పుస్తకాలను అందిస్తున్నానన్నారు. జిల్లాలోని నిరుద్యోగులకు ఉచితంగా కోచింగ్ కూడా ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఇరకాటంలో ఇరిగేషన్..!

**డెల్టా ఆధునికీకరణ పనులపై ప్రభుత్వం మౌనం**
**ప్రతిపాదనలు పంపినా సమాధానం కరువు**
**రూ.600 కోట్లకుపైగా పనులు పడక**
**15న కాలువల మూసివేతకు నిర్ణయం**
**కాలువలు పూడుకుపోయి ప్రతియేటా పంట నష్టం**
**మెయింటినెన్స్ పనులకైనా నిధులిచ్చేనా?**

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

డెల్టా ఆధునికీకరణ పనులపై ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు జిల్లా రైతాంగాన్ని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. పంట కాలువలు పూడుకుపోయి ప్రతియేటా ఖరీఫ్‌లో వేలాది ఎకరాల్లో పంట నష్టపోవడంతోపాటు రబీలో సాగునీటి కోసం అష్టకష్టాలు పడాల్సిన దుస్థితి నెలకొంది. ఈ ఏడాది కూడా ఆధునికీకరణ పనులపై ప్రభుత్వం మౌనం వహిస్తోంది. కనీసం కాలువల మెయింటినెన్స్ పనులకైనా నిధులిస్తారా అని ఆలోచించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఏప్రిల్ 15న పంట కాలువల మూసివేతకు నిర్ణయించినట్లు తెలుస్తోంది. జూన్ ఒకటో తేదీన కాలువలకు తిరిగి సాగునీరు విడుదల చేయనున్నారు. దాదాపు రెండు నెలల 15 రోజుల సమయం ఉంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఖరీఫ్, రబీల్లో దాదాపు ఎనిమిది లక్షలకుపైగా ఎకరాల్లో వరిసాగు సాగుతోంది. డెల్టాలో వరిసాగే ప్రధానంగా ఉంది. 11 ప్రధాన కాలువలు, 300కుపైగా పిల్ల కాలువల ద్వారా డెల్టా ఆయకట్టుకు సాగునీరు సరఫరా సాగుతోంది. వైసిపి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక జిల్లాలో డెల్టా కాలువల ఆధునికీకరణ పరిస్థితి అత్యంత దారుణంగా మారింది. జిల్లాకు ఇద్దరు మంత్రులున్నా రైతులకు మేలు జరగని పరిస్థితి నెలకొంది. గడిచిన మూడేళ్లుగా జిల్లాలో డెల్టా ఆధునికీకరణ పనులు పూర్తిగా పడకేశాయి. చిన్నచిన్న మెయింటినెన్స్ పనులు మినహా కాలువల పూడికగాని, షట్టర్లకు సంబంధించిన పనులుగాని ఏఒక్కటీ జరగని పరిస్థితి ఉంది. వైసిపి ఐదేళ్ల పాలనలో ఆధునికీకరణ పనులకు ఇదే చివరి ఏడాది. ఈ ఏడాదైనా ఎంతోకొంత ఆధునికీకరణ పనులు చేస్తారని రైతులు భావించారు. జిల్లాలో దాదాపు రూ.600 కోట్లు విలువైన ఆధునికీకరణ పనులకు సంబంధించిన ప్రతిపాదనలను ఇరిగేషన్ అధికారులు ప్రభుత్వానికి పంపించారు. ప్రతియేటా ఇదేవిధంగా ప్రతిపాదనలు పంపడం, ప్రభుత్వం పట్టించుకోకపోవడం సర్వసాధారణమైంది. ఈ ఏడాది సైతం అదే పరిస్థితి కొనసాగుతోంది. మరో వారం రోజుల్లో కాలువలు మూసివేసే గడువు సమీపిస్తోంది. అయినప్పటికీ ఆధునికీకరణ పనులపై ప్రభుత్వం మాత్రం పట్టించుకోవడం లేదు. ఆధునికీకరణ పనులు సంగతి పక్కన పెడితే కనీసం మెయింటినెన్స్ పనులకు సంబంధించిన నిధులైనా ఇస్తారా అనే బెంగ అందరినీ వెంటాడుతోంది. ప్రతియేటా కాలువలు, షట్టర్లు వద్ద మెయింటినెన్స్ పనులకు జిల్లాలో రూ.50 కోట్లు వరకూ ఖర్చవుతోంది. ఈ నెల 12న విజయవాడలో ఇరిగేషన్ శాఖ సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో మెయింటినెన్స్‌కు సంబంధించిన నిధులపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ నిధులైనా జిల్లాకు సరిపడా కేటాయిస్తారా అనే అనుమానం నెలకొంది.

**రైతులు నష్టపోతున్నా పట్టని ప్రభుత్వం**

తమది రైతు ప్రభుత్వమని వైసిపి సర్కార్ గొప్పలు చెప్పడం మినహా రైతుల గురించి ఆలోచించిన పరిస్థితి లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. డెల్టాలో కాలువలు మొత్తం పూడుకుపోయి సాగునీరు సక్రమంగా కిందకు పారని దుస్థితి ఏర్పడింది. ఖరీఫ్‌లో చిన్నపాటి వర్షాలకు సైతం కాలువలు ఎగదన్ని పొలాలన్నీ నీట మునిగిపోతున్నాయి. దీంతో రైతులు పెద్దఎత్తున పంట నష్టపోతున్నారు. ఎకరాకు రూ.30 వేలకుపైగా పెట్టుబడులు పెట్టిన రైతులు పంటనష్టంతో అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. ప్రభుత్వం ఎకరాకు ఇచ్చే నష్టపరిహారం రూ.ఆరు వేలు మాత్రమే. ఆ పరిహారం కూడా సాగు చేయని భూయజమానులకు ఇస్తున్నారు. జిల్లాలో 70 శాతం సాగు కౌలురైతులే చేస్తున్నారు. వీరంతా ప్రతియేటా పెద్దఎత్తున నష్టాలను చవిచూస్తున్నారు. డెల్టా ఆధునికీకరణ పనులు జరిగితే పంటనష్టం జరిగే పరిస్థితి ఉండదు. రైతులకు అత్యంత అవసరమైన ఆధునికీకరణ పనులపై ప్రభుత్వానికి ఏమాత్రం పట్టడం లేదనే అభిప్రాయం రైతుల్లో వ్యక్తమవుతోంది. దీంతో ప్రభుత్వ తీరుపై రైతుల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది.

## పంచాయతీలకు నిధులివ్వాలని సిపిఎం దీక్ష

ప్రజాశక్తి - వీరవాసరం

ఎర్ర కండువా వేసి దీక్షను ప్రారంభిస్తున్న మంతెన సీతారాం, బలరాం

పంచాయతీలకు నిధులివ్వకపోతే గ్రామాభివృద్ధి ఎలా సాధ్యమో రాష్ట్ర ప్రభుత్వం చెప్పాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం ప్రశ్నించారు. పంచాయతీ నిధులను తక్షణం ఆయా పంచాయతీలకే జమ చేయాలని కోరుతూ స్థానిక తూర్పు చెరువు సెంటర్ వద్ద సిపిఎం చేపట్టిన ఒక్కరోజు దీక్షను శనివారం సీతారాం ప్రారంభించారు. ఈ దీక్షకు టిడిపి, జనసేన సంఘీభావం తెలిపాయి. దీక్షకు మద్దతుగా టిడిపి మండల అధ్యక్షురాలు వీరవల్లి దుర్గాభవాని, జనసేన మండల అధ్యక్షుడు గుండా రామకృష్ణ సంఘీభావం తెలిపి మాట్లాడారు. అనంతరం మంతెన సీతారాం మాట్లాడుతూ గ్రామాలే దేశానికి పట్టుకొమ్మలు, గ్రామాభివృద్ధే దేశాభివృద్ధి అంటూ చెప్పుకునే ఈ ప్రభుత్వాలు పంచాయతీల హక్కులను హరించుకుంటూ వస్తున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం నుండి పంచాయితీలకు నేరుగా వచ్చే ఆర్థిక సంఘాల నిధుల విధానాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దెబ్బతీస్తున్నాయన్నారు. పంచాయతీల్లో నిధుల్లేక అధికార, ప్రతిపక్ష పాలకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. సర్పంచులు తాము ప్రజలకిచ్చిన వాగ్దానాలను నెరవేర్చలేకపోవడంతో వ్యతిరేకతను ఎదుర్కొంటున్నారన్నారు. పంచాయతీల నిధుల సమస్యను ఎంఎల్ఎలు అసెంబ్లీలో చర్చించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బడ్జెట్‌లలో సగభాగం నిధులు పంచాయతీలకు పంపాలని నిబంధనలున్నా అవేమీ ఈ ప్రభుత్వాలు అమలు చేయడం లేదన్నారు. రాజకీయ కోణంలో తక్కువ జనాభాతో చిన్న పంచాయతీల ఏర్పాటు జరగడంతో అవి నిధుల కొరతను ఎదుర్కొంటున్నాయన్నారు. స్థానిక సంస్థల నిధులను రాష్ట్ర ప్రభుత్వం ఇతర అవసరాలకు కేటాయించుకుంటూ జవాబుదారీతనం లేకుండా వ్యవహరిస్తుందన్నారు. కేరళ రాష్ట్రంలో అమలవుతున్న పంచాయతీ పాలనను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. పార్టీలకు అతీతంగా స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు.

సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం దీక్షకు సంఘీబావం తెలిపి మాట్లాడుతూ పంచాయతీలు ఎదుర్కొంటున్న నిధుల సమస్యను రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు జుత్తిగ నరసింహమూర్తి, మండల కన్వీనర్ పోతుల మృత్యుంజయ, యండమూరి సుబ్బారావు, కేతా జ్యోతిబసు, తాళ్లూరి రాము, లింగం సత్యనారాయణ, బొర్రా ఆలమహారాజు, జుత్తిగ సాంబియాంబ, టిడిపి ఎంపిటిసి అంగర కుటుంబరావు పాల్గొన్నారు.

**ఉలిక్కిపడ్డ అధికారపక్షం.. దీక్షా శిబిరం తొలగింపు**

పంచాయతీ నిధులపై సిపిఎం చేపట్టిన దీక్షతో అధికార పక్షం ఉలిక్కిపడింది. ఎప్పటిలాగే పోలీసులను పంపి శిబిరం తొలగింపు చర్యలకు దిగింది. దీంతో కొద్దిసేపు సిపిఎం నేతలకు, పోలీసులకు మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. ఉన్న సమస్యను ఎత్తి చూపితే ఉలుకెందుకు అంటూ సిపిఎం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

# మోడీ ప్రజా వ్యతిరేక విధానాలపై రాజకీయ ప్రచార భేరి

**సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం**

ప్రజాశక్తి - భీమవరం

మోడీ ప్రజా వ్యతిరేక, నియంతృత్వ విధానాలపై సిపిఎం, సిపిఐ సంయుక్తంగా ఈ నెల 14 నుంచి రాజకీయ ప్రచార భేరి నిర్వహిస్తున్నట్లు సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం తెలిపారు. శనివారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో ఆ పార్టీ జిల్లా కమిటీ సమావేశం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథి సీతారాం మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలతో నియంతృత్వంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన ఈ ఎనిమిదేళ్లలో ప్రజలపై భారాలు మరింత పెరిగాయన్నారు. దేశ సంపద కూడా కేవలం అదానీకే కట్టబెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్లమెంటులో ప్రజా సమస్యలపై చర్చించడం కంటే దేశంలో ఉన్న కార్పొరేట్లకు ప్రజాధనం, సబ్సిడీలు, రుణ మాఫీపై మాత్రమే చర్చలు సాగుతున్నాయన్నారు. దేశంలోని ప్రభుత్వరంగ సంస్థలను అన్నింటినీ కారుచౌకగా అమ్మేస్తున్నారన్నారు. ప్రశ్నిస్తున్న వారిపై ఇడి, సిబిఐ వంటి దర్యాప్తు సంస్థలను ఉపయోగించి దాడులు చేయిస్తున్నారని గుర్తు చేశారు. దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ నడుస్తుందని ఆరోపించారు. మోడీ నియంతృత్వ పాలనపై ప్రజలందరూ ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. బిజెపి నియంతృత్వ పాలనకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో రాజకీయ ప్రచార భేరి యాత్రలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా ఈ నెల 14వ తేదీ నుంచి ఉభయ కమ్యూనిస్టు పార్టీల ఆధ్వర్యంలో జిల్లాలో ఈ యాత్ర ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ యాత్రలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

**శాంతియుతంగా దీక్ష చేస్తే అడ్డుకోవడం దారుణం: బలరాం**

గ్రామ పంచాయతీలకు నిధులివ్వాలని కోరుతూ వీరవాసరం మండల కేంద్రంలో శాంతియుతంగా చేస్తున్న దీక్షను పోలీసులు బలవంతంగా భగ్నం చేయడం దారుణమని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం మండిపడ్డారు. జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాలు పేరుతో పంచాయతీల నిధులను పక్కదారి పట్టిస్తుందని ఆరోపించారు. పంచాయతీల అభివృద్ధి ఆగిపోతుంది.. మాకు నిధులివ్వండి అని పంచాయతీ సర్పంచులు శాంతియుతంగా ఒక్కరోజు దీక్షకు దిగారని తెలిపారు. శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు రాజ్యాంగం కల్పించిందని, అయితే ఒక్క రోజు దీక్షకు కూడా ప్రభుత్వం నిర్బంధం పెట్టిందని విమర్శించారు. స్థానిక ఎంఎల్ఎ ఆదేశాలతో సర్పంచుల దీక్షను పోలీసులతో బలవంతంగా భగ్నం చేయడం దారుణమన్నారు. దౌర్జన్యంగా దీక్షా శిబిరాన్ని తొలగించడాన్ని తమ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. స్థానిక ఎంఎల్ఎ ప్రజాఉద్యమాలపై నిర్బంధాలు పెట్టడం సబబు కాదన్నారు. గ్రామ పంచాయతీల సమస్యలపై సర్పంచులు చేసే న్యాయమైన పోరాటానికి సిపిఎం సంపూర్ణ మద్దతు తెలుపుతుందన్నారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతా గోపాలన్, కౌరు పెద్దిరాజు, దూసి కళ్యాణి, పివి.ప్రతాప్, బురిడి వాసుదేవరావు, సీనియర్ నాయకులు జుత్తిగ నరసింహమూర్తి, కె.రాజారామ్మోహన్‌రాయ్, నేతలు గొర్ల రామకృష్ణ, ఎం.వైకుంఠరావు, జవ్వాది శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## తాగునీరు అందుబాటులో ఉంచండి

**'పది' పరీక్షా కేంద్రాల్లో కలెక్టర్ ప్రశాంతి ఆకస్మిక తనిఖీలు**

ప్రజాశక్తి - పాలకోడేరు

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

పదో తరగతి పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు సురక్షిత తాగునీరు అందుబాటులో ఉంచాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. మండలంలోని పాలకోడేరు, మోగల్లు జెడ్‌పి హైస్కూళ్లలో జరుగుతున్న పదో తరగతి పరీక్షల నిర్వహణ తీరును ఆమె శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రాల్లో ఏర్పాట్లను పరిశీలించి పరీక్షకు హాజరైన విద్యార్థుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ సీసీ కెమెరాల పనితీరును ఇతర మౌళిక సదుపాయాలను పరిశీలించినట్లు తెలిపారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని, ఎలక్ట్రికల్ అసిస్టెంట్‌ను పరీక్షా సమయం వరకూ ఒకరిని అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. మెడికల్ క్యాంపులో అన్ని రకాల మందులు, ఒఆర్ఎస్ ప్యాకెట్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కలెక్టర్ వెంట డిఇఒ ఆర్.వెంకటరమణ, తహశీల్దారు షేక్ హుస్సేన్, ఎంపిడిఒ ఎంఎన్.గంగాధరరావు, చీఫ్ సూపరింటెండెంట్లు, పరీక్షల పరిశీలకులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

నినదిస్తున్న సిపిఎం నేతలు, రైతులు

## సాగునీరందించాలని సిపిఎం ధర్నా

ప్రజాశక్తి - పోడూరు

గుమ్మలూరు, రావిగొప్పు నక్కల డ్రెయిన్‌ను ఆనుకుని ఉన్న వంద ఎకరాల ఆయకట్టులో వరి పైరకు సాగునీరు అందించాలని సిపిఎం మండల కార్యదర్శి పిల్లి ప్రసాద్, నేత రాపాక వెంకటేశ్వరావు డిమాండ్ చేశారు. నీరు లేక భూమి నెరలు తీసిన చేలో దిగి రైతులు సిపిఎం ఆధ్వర్యాన శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాట్లు సమయంలో వంతె నిర్మాణం కారణంగా ఒక నెల రోజులు సాగునీరు ఆలస్యంగా ఇచ్చారన్నారు. అందువల్ల ఆ ప్రాంతానికి ఇంకా సాగునీరు అవసరం ఉందన్నారు. పైరు పాలు పోసుకునే సమయానికి నీరు లేకపోతే రైతులు మొత్తం పంట నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే సాగునీరు అందించకుంటే ఎకరానికి రూ.70 వేలు అధికారులు రైతులకు చెల్లించాలని హెచ్చరించారు. కార్యక్రమంలో కౌలురైతులు పైడి వెంకటేశ్వరరావు, చింతపల్లి సూర్యనారాయణ, దొంగ మసేను, ఈతకోట భాస్కరరావు, ఆకుమర్తి ప్రసాద్, వేంద్ర రాంబాబు, ఉన్నమట్ల బాలయ్య, ఆకుమర్తి పెద్దిరాజు, రాపాక రామకృష్ణ, ఏడుకొండలు, కండెల్లి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## తాగునీటి వనరులు కలుషితం కాకుండా కాపాడాలి

**ఆక్వా చెరువు తవ్వకాలు చేపట్టకుండా పంచాయతీ తీర్మానించాలని ఏలూరుపాడు వాసుల డిమాండ్**

ప్రజాశక్తి - కాళ్ల



ఆక్వా చెరువు తవ్వే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న గ్రామస్తులు

ఏలూరుపాడులో ఆక్వా సాగుతో తాగునీటి వనరులను కలుషితం చేయొద్దని, ఆక్వా చెరువుల తవ్వకాలు చేపట్టొద్దని పంచాయతీ తీర్మానం చేయాలని గ్రామస్తులు శనివారం ఆ గ్రామ సర్పంచి భూపతిరాజు వెంకట జగ్గరాజుకు విన్నవించారు. ఏలూరుపాడులో గాంధీబజార్ వీధిలో రక్షిత మంచినీటి చెరువు, నివాసాలకు సమీపంలో వ్యవసాయ భూములను చేపల చెరువులుగా మార్చేందుకు ప్రయత్నిస్తుండగా గ్రామస్తులు ఇటీవల జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆర్ఎస్ నెంబర్.228 నుంచి 247 వరకు ఉన్న వ్యవసాయ భూములను చేపల చెరువులుగా మార్చితే వాటికి సమీపంగా ఉన్న రక్షిత మంచినీటి చెరువు కలుషితమవుతుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆక్వా చెరువుల వల్ల పర్యావరణానికి ముప్పు పొంచి ఉందని, భూగర్భ జలాలు పూర్తిగా దెబ్బతినే అవకాశాలు ఉన్నాయని, తాగునీటి వనరులు పూర్తిగా నాశనమవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. భవిష్యత్తు తరాలను దృష్టిలో ఉంచుకుని ఆక్వా చెరువులు తవ్వకూడదని, పంచాయతీ తీర్మానం చేయాలంటే గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఏలూరుపాడులో ఎనిమిది వేల మంది జనాభా ఉన్నారని, ఇప్పటికే గ్రామంలో తాగునీటి సమస్య ఉందని తెలిపారు. ఈ పరిస్థితుల్లో తాగునీటికి ప్రధాన ఆధారమైన నాగుల చెరువు ఎగువ భాగంలో ఆక్వా చెరువుల తవ్వకం చేపట్టకూడదని తాము అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఆక్వా చెరువులు తవ్వకుండా పంచాయతీ తీర్మానం చేయాలని, ప్రజలకు స్వచ్ఛమైన నీరందించాలని సర్పంచి జగ్గరాజును గ్రామస్తులు కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి చిన్నపరపు రాంబాబు, నల్లగచ్చు నాగార్జున, నిమ్మకాయల సాయి, మాదేటి రాఘవులు, కొట్టు ప్రభాకర్, యాదాల వెంకటేశ్వరరావు, కొండపల్లి మోహన్ పాల్గొన్నారు.

## 16 రోజులపాటు మెగా రక్తదాన శిబిరాలు

**మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు నన్నేటి పుష్పరాజ్**

ప్రజాశక్తి - భీమవరం రూరల్



మాట్లాడుతున్న పుష్పరాజ్

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ 132వ జయంతి సందర్భంగా భీమవరం ఎఎస్ఎన్.రాజు ఛారిటబుల్ ట్రస్ట్ సహకారంతో మాలమహానాడు ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా మెగా రక్తదాన శిబిరాలను నిర్వహిస్తున్నామని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు నన్నేటి పుష్పరాజ్ తెలిపారు. శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమాజ సేవా కార్యక్రమాలతోపాటు రక్తదాన శిబిరాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 12 నుంచి 30వ తేదీ వరకు ప్రతి గ్రామంలోనూ, పట్టణంలోనూ మెగా రక్తదాన శిబిరాలను నిర్వహించనున్నామని, వీటిలో అంబేద్కర్ అభిమానులు పాల్గొనాలని కోరారు. అంబేద్కర్ జయంతిని ఘనంగా జరుపుకుని సమాజ సేవలో ముందుండాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నేతలు ఎఎస్ఎన్.రాజు, నేతల సువర్ణరాజు, సంది జైరాజ్, నన్నేటి నాగరాజు, ప్రసాదరావు, పిట్టా వినోద్‌కుమార్, దాసరి చిరంజీవి, చిగురుపాటి రాజేష్, భాగ్యరాజు, భద్రం తదితరులు పాల్గొన్నారు.

## ఆదర్శప్రాయులు నారాయణస్వామి

**సంస్మరణ సభలో పలువురు ప్రజాప్రతినిధులు, నేతలు**

ప్రజాశక్తి - ఉండి

నివాళులర్పిస్తున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ప్రముఖులు

మాజీ మంత్రి, పోలవరం ప్రాజెక్ట్ సాధన సమితి కన్వీనర్ యర్రా నారాయణస్వామి ఆదర్శప్రాయులని పలువురు నాయకులు అన్నారు. శనివారం ఆయన స్వగ్రామం ఉప్పులూరులో నిర్వహించిన నారాయణస్వామి సంస్మరణ సభలో పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఎంఎల్ఎలు మంతెన రామరాజు (ఉండి), గ్రంధి శ్రీనివాస్ (భీమవరం), పువ్వాల వాసుబాబు (ఉంగుటూరు), చెరుకువాడ శ్రీరంగనాధరాజు (ఆచంట), సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం, జిల్లా కార్యదర్శి బి.బలరాం, కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్, జనసేన జిల్లా అధ్యక్షులు కొటికలపూడి గోవిందరావు, తెలుగు రైతుసంఘం నాయకులు పాతూరి రాంప్రసాద్‌చౌదరి, మాజీ ఎంఎల్ఎలు వేటుకూరి వెంకట శివరామరాజు, ఈలి నాని తదితరులు నారాయణస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ సర్పంచి స్థాయి నుండి రాజ్యసభ సభ్యుని స్థాయికి ఎదిగిన ఆయన ఎంతోమందికి ఆదర్శప్రాయుడన్నారు. పార్టీలకతీతంగా ప్రతిఒక్కరితో ఎంతో ఆప్యాయంగా మాట్లాడేవారన్నారు. నారాయణస్వామి జీవితాన్ని యువత స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. రాజకీయ కురువృద్ధుడు నారాయణస్వామి మృతి జిల్లాకు తీరని లోటని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆకుల హరేరాం, సిపిఎం నాయకులు దండు రామలింగరాజు, కిల్లారి తవిటి నాయుడు, యర్రా కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## పిల్లలను చెడు అలవాట్లకు దూరంగా ఉంచాలి

ప్రజాశక్తి - తణుకు

పిల్లలను చెడు అలవాట్లకు దూరంగా ఉంచాలని, మొబైల్ ఫోన్లకు అలవాటు పడకుండా చూడాలని మిత్ర వాక్ అధినేత డాక్టర్ ఆశ్లేష ఈదల అన్నారు. స్థానిక మాంటిస్సోరి స్కూల్లో బాల్య శోభ 21వ శతాబ్దపు తల్లిదండ్రుల అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్లేష మాట్లాడుతూ ప్రస్తుతం ప్రతి ఇంట్లో ఆర్థిక, అనారోగ్య సమస్యలను మించి పెనుభూతంగా వెంటాడుతున్న ప్రధాన సమస్య పిల్లల చదువు, వ్యక్తిగత అంశాల పట్ల శ్రద్ధ పెట్టకపోవడమేనన్నారు. పిల్లలను కేవలం మార్కుల కోసమే కాకుండా జీవించేలా కాకుండా విజేతలుగా ప్రపంచానికి పరిచయం చేయాలన్నారు. స్కూల్ డైరెక్టర్ ప్రకాష్‌రావు మాట్లాడుతూ విద్యార్థుల బంగారు భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని తమ స్కూల్లో మరిన్ని కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రధానోపాధ్యాయిని లక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## కొడమంచిలిలో చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - ఆచంట

చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సీతారాం, ప్రముఖులు

గత 30 సంవత్సరాలుగా కొడమంచిలి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సేవా దృక్పథంతో చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని మండల సర్పంచుల ఛాంబర్ అధ్యక్షులు సుంకర సీతారామ్ అన్నారు. కొడమంచిలి పంచాయతీ కార్యాలయం వద్ద ఉన్న రామాలయం వద్ద ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీతారామ్ మాట్లాడుతూ వేసవిలో గ్రామస్తుల దాహార్తిని తీర్చడానికి ఇటువంటి చలివేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం అధ్యక్షులు బాలనాగు నరేష్, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు బాలనాగు శ్రీనివాస్, నాయకులు కొల్లేపర వెంకన్నబాబు, కొల్లేపర సాయిబాబా, కాజా రాజా, కాజా సర్వేశ్వరరావు, బాలనాగు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

# వీరవాసరంలో ఆక్రమణల తొలగింపు

ప్రజాశక్తి - వీరవాసరం

వీరవాసరం పంచాయతీ పరిధిలో తూర్పుచెరువు వద్ద ఫిల్టర్‌బెడ్‌లను ఆనుకుని ఆక్రమిత స్థలంలో తాత్కాలిక షెడ్‌లను శనివారం పంచాయతీ కార్యదర్శి జెడివి.ప్రసాద్, ఇఒపిఆర్‌డి షరీఫ్ ఆధ్వర్యంలో ఎస్ఐ రమేష్ పర్యవేక్షణలో తొలగించారు. ఆక్రమణల తొలగింపు పట్ల అధికారుల తీరుపై ఆక్రమణదారులు, ఇద్దరు పంచాయతీ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. మానవతా దృక్పథంతో రెండు రోజులు గడవు ఇవ్వాలని కోరారు. ఇందుకు అధికారులు ఒప్పుకోకపోవడంతో అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో కొన్ని ఆక్రమణలు తొలగించాలని పంచాయతీ తీర్మానించినా ముందుకు రాని అధికారులు ఎటువంటి అభ్యంతరాలు లేని ఇక్కడి ఆక్రమణలు ఎలా తొలగిస్తున్నారంటూ వారు అధికారులతో వాగ్వివాదానికి దిగారు. ఇదే ప్రాంతంలో చెరువు పోరంబోకుకు చెందిన సుమారు ఎకరం ప్రభుత్వ స్థలంలో పక్కా భవనాలు నిర్మించుకున్నా వాటి జోలికి పోలేని అధికారులు ఉద్దేశపూర్వకంగానే ఇక్కడ ఆక్రమణలు తొలగిస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో మిగతా ఆక్రమణలు తొలగించాలని, లేకపోతే అధికారులు చూపుతున్న పక్షపాత వైఖరిపై ఆందోళన చేస్తామంటూ హెచ్చరించారు.

ఆక్రమణలు తొలగిస్తున్న జెసిబి

వెంకన్న విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న గ్రంధి

## చింతలకోటిగరువులో పంజా వెంకన్న విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి - వీరవాసరం

రాజకీయ పార్టీలకు అతీతంగా ఆత్మీయుడు, స్నేహపాత్రుడు మాజీ సర్పంచి పంజా వెంకన్న అని భీమవరం ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ కొనియాడారు. చింతలకోటిగరువు మాజీ సర్పంచి పంజా వెంకన్న విగ్రహాన్ని ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ శనివారం చింతలకోటిగరువులో అవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నపెద్ద తేడాలేకుండా ప్రోత్సహించే వ్యక్తి వెంకన్న అన్నారు. సర్పంచిగా, ఎంపిటిసిగా రాజకీయంగా ఆయన చింతలకోటిగరువు గ్రామాన్ని అభివృద్ధి చేశారన్నారు. పెద్ద రాజకీయ నాయకులు వద్దకు ధైర్యంగా వెళ్లి వారితో కలిసిపోయి తన పనులు సాధించుకునేవారన్నారు. తన తండ్రి కాలం నాటి నుంచి వెంకన్న తనకు ఆత్మీయుడుగా ఉన్నారన్నారు. వెంకన్న పట్ల తనకున్న గౌరవాన్ని ఎవరు తీసేయలేరన్నారు. ఆయనతో తనకున్న అనుబంధాన్ని మాటల్లో చెప్పలేనని, ఆయన కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటానని చెప్పారు. ఈ కార్యక్రమంలో భీమవరం ఎఎంసి ఛైర్మన్ కోటిపల్లి బాబు, సర్పంచి దాసరి మహాలక్ష్మి, ఉపసర్పంచి దాసరి మాణిక్యాలరావు, వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ గొలగాని సత్యనారాయణ, రాయకుదురు సొసైటీ ఛైర్మన్ కటికిరెడ్డి రాంబాబు, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు పోలిశెట్టి సత్యనారాయణ, మానుకొండ ప్రదీప్‌కుమార్, వీరవాసరం, రాయకుదురు సర్పంచులు చికిలే మంగతాయారు, గెడ్డం భారతీభాస్కరరావు, నేతల జ్ఞానసుందరరాజు, వెంకన్న కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## నేడు శ్రీరామరాజు 32వ వర్ధంతి సభ

ప్రజాశక్తి - పాలకోడేరు

గొల్లలకోడేరు గ్రామానికి చెందిన కమ్యూనిస్టు నేత గాదిరాజు శ్రీరామరాజు 32వ వర్ధంతి కార్యక్రమం ఆదివారం ఆయన స్వగ్రామంలో ఆదివారం నిర్వహించనున్నారు. శ్రామికులు, రైతులు, కూలీల సమస్యల పరిష్కారానికి శ్రీరామరాజు కమ్యూనిస్టు ఉద్యమ తొలినాళ్లలో ఎంతో కృషి చేశారన్నారు. గొల్లలకోడేరు గ్రామ సర్పంచిగా 13 ఏళ్లు పని చేసి ప్రజల మన్ననలు పొంది గ్రామాభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. కమ్యూనిస్టు పార్టీ భీమవరం తాలూకా కార్యదర్శిగా, రైతు నాయకుడిగా, వ్యవసాయ కార్మిక సంఘం నాయకునిగా శ్రీరామరాజు పనిచేశారన్నారు. శ్రీరామరాజు కూలిరేట్లు, ఇళ్ల స్థలాల సమస్య, మద్దతు ధరలపై అనేక పోరాటాలు చేశారన్నారు. ముఖ్యంగా భీమవరం ప్రాంతంలో పార్టీ అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. శ్రీరామరాజు అటు పేద ప్రజలకు ఇటు గ్రామ అభివృద్ధికి చేసిన కృషిని స్మరించుకునేందుకు 32వ వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆయన కుమారుడు మాజీ సర్పంచి గాదిరాజు సూర్యనారాయణ రాజు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిపిఎం రాష్ట్ర, జిల్లా, డివిజన్, మండల నాయకులు హాజరు కానున్నట్లు వెల్లడించారు. తండ్రి శ్రీరామరాజు విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించడంతో పాటు పలు సేవా కార్యక్రమాలు చేపట్టినునట్లు పేర్కొన్నారు.

## పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ప్రజారోగ్య పరిరక్షణ కోసం ప్రజల్లో అవగాహన కలిగించేందుకు వైద్య ఉద్యోగుల బృందం డాక్టర్ వైఎస్ఆర్ పట్టణ ఆరోగ్య కేంద్రం, వీకర్స్ కాలనీ పరిధిలోని 2, 3, 4 వార్డుల్లో జరుగుతున్న డ్రై డే కార్యక్రమంలో తాడేపల్లిగూడెం మలేరియా సబ్ యూనిట్ అధికారి యేలూరి వెంకట లక్ష్మణరావు శనివారం పర్యటించారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఫీవర్ సర్వే, డ్రై డే కార్యక్రమాల పరిశీలన చేస్తూ, దోమలద్వారా వచ్చే వ్యాధులపై అవగాహన కార్యమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ దోమలు పుట్టకుండా ప్రజలు తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేస్తూ, పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు, డబ్బాలు, టైర్లు, కొబ్బరి బొండాలు, పనికిరాని చెత్తా చెదారాలు లేకుండా చూసుకోవాలన్నారు. గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహించిన వైద్య ఉద్యోగుల బృందం ప్రజలతో మమేకమై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వార్డు ఆరోగ్య కార్యకర్తలు, ఆరోగ్య సహాయకులు కాంతారావు, ఆశా కార్యకర్తలు, వాలంటీర్లు పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య ఉద్యోగుల బృందం, ఆశావర్కర్లు

## పూర్తి స్థాయిలో రోడ్ల అభివృద్ధి : ఎంఎల్ఎ గ్రంధి


ఆర్అండ్‌బి శాఖ ఉన్నతాధికారులతో సమీక్షిస్తున్న ఎంఎల్ఎ గ్రంధి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరం నియోజకవర్గంలో రోడ్లను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తున్నామని ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు శనివారం సాయంత్రం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఆర్అండ్‌బి శాఖ ఉన్నత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ ఇప్పటికే పలు రోడ్లను నిర్మించినట్లు చెప్పారు. అదే మాదిరిగా కొన్ని రోడ్లకు మరమ్మతుల పనులు కూడా చేపట్టి పూర్తి చేసినట్లు తెలిపారు. తాజాగా ఎల్‌విఎన్.పురం రోడ్డు మరమ్మతులకు రూ.40 లక్షలు, యమునాపల్లి నుంచి శృంగవృక్షం రోడ్డు వరకు మరమ్మతుల నిమిత్తం రూ.30 లక్షలు, దెయ్యాలతిప్ప నుంచి నాగిడిపాలెం రోడ్డు మరమ్మతులకు రూ.16 లక్షల నిధులను మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ పనులు త్వరలోనే ప్రారంభమవుతాయని తెలిపారు. ఈ సమావేశంలో ఎస్ఇ జివి.భాస్కరరావు, ఇఇ లోకేశ్వరరావు, డిఇ రామరాజు, జెఇ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## పలు గ్రామాల్లో 'మా భవిష్యత్తు నువ్వే జగనన్న'

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

మండలంలోని అరట్ల కట్ట గ్రామంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్ శనివారం నిర్వహించారు. దీనిలో భాగంగా ప్రతి ఇంటికి వెళ్లి స్టిక్కర్లు అంటించారు. జగనన్న ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, అందుతున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. జగనన్న వస్తేనే మళ్లీ ఈ సంక్షేమ పథకాలన్నీ అందుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెసిఎస్ కన్వీనర్ మద్దాల వాసు, చెల్లె ఆనంద ప్రకాష్, బొడ్డు బాబ్జి, పార్సి వెంకటరత్నం, పితాని చిన్న పాల్గొన్నారు.

**ఆచంట :** సమాజంలో అన్ని వర్గాల సంక్షేమం కోసం సిఎం జగన్ పారదర్శక పాలన అందిస్తున్నారని వైసిపి రాష్ట్ర కార్యదర్శి వైట్ల కిషోర్‌కుమార్ అన్నారు. జగనన్న మా నమ్మకం కార్యక్రమం మండలంలోని ఆచంట పంచాయతీ పరిధి పొర, కవురుపాలెం, కొడమంచిలి, పెదమల్లం, భీమలాపురం, కరుగోరుమిల్లి, కందరవల్లి, వల్లూరు, పెనుమంచిలి, ఆచంట, వేమవరం పలు గ్రామాల్లో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ పెచ్చేటి సత్యనారాయణ, కోట వెంకటేశ్వరరావు, దేవస్థానం ఛైర్మన్లు కుక్కల కిరణ్‌కుమార్, వేమన అప్పారావు, కంద్రేగుల కనకయ్య, యాళ్ల బాలాజీ, బొక్కా రామకృష్ణ, వేండ్ర సుబ్బారావు, రమణ, వేండ్ర శ్రీను, కడలి దేవి పాల్గొన్నారు.

**ఉండి :**పాదయాత్రలో ఇచ్చిన హామీల్లో నూటికి 98 శాతం అమలు చేసిన ఘనత సిఎం జగన్‌దేనని వైసిపి జిల్లా అధికార ప్రతినిధి బడుగు బాలాజీ గౌడ్ అన్నారు. ఉండిలో శనివారం నిర్వహించిన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా వైసిపి నాయకులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పలువురు నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీలను 98 శాతం నెరవేర్చి నిరుపేదల కుటుంబాల్లో వెలుగులు నింపారన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరిస్తూ ప్రజల అభిప్రాయాలను సేకరిస్తున్నామన్నారు. ప్రతి ఇంటి యజమాని ఇష్టానుసారమే మా నమ్మకం నువ్వే జగనన్న స్టిక్కర్‌ను అంటిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి సంపూర్ణ మద్దతు లభిస్తుందన్నారు. 2024 ఎన్నికల్లో ఉండి నియోజకవర్గంలో కూడా వైసిపి జెండా ఎగరేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి కమతం సౌజన్యబెనర్జీ, ఉపసర్పంచి కల్యాణ్‌వర్మ, గ్రీవెన్స్ సెల్ జిల్లా అధ్యక్షులు కరిమెరక రామచంద్రరావు, పార్టీ గ్రామ అధ్యక్షులు కరిమెరక మల్లికార్జున్, ఎంపిటిసి సభ్యులు వీరమల్లు సత్యవతి, గిరడ రమణశ్రీను, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గలావిల్లి ధనుంజయ, సచివాలయ కన్వీనర్ సోము నాగమణి, ఏడిద వెంకటేశ్వరరావు, తాడేపల్లి మూర్తి, గృహ సారధులు మల్లేశ్వరరావు, దుర్గారావు, సతీష్, కన్నా సాహెబ్, సునీల్, వెంకన్నబాబు పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్ : మాట్లాడుతున్న జెడ్‌పి ఛైర్మన్

## 'వైసిపి పాలనలో సామాన్యుల జీవనం అధోగతి'

ప్రజాశక్తి - మొగల్తూరు

వైసిపి పాలనలో సామాన్యుని జీవనం ప్రశ్నార్థకంగా మారిందని టిడిపి నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు అన్నారు. శనివారం సాయంత్రం మొగల్తూరులోని గొల్లగూడెంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం ఆ పార్టీ మొగల్తూరు మండల శాఖ అధ్యక్షుడు గుబ్బల నాగరాకు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పొత్తూరి రామారాజు ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలు టిడిపి వైపు మక్కువగా ఉన్నారన్నారు. రానున్న ఎన్నికల్లో టిడిపి విజయం సాధించడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో బస్వాని ఏడుకొండలు, కలిదిండి కుమార్‌బాబు, డోల్ల రత్నంరాజు, కొల్లాటి బోగరాజు, పెచ్చేటి నాగేశ్వరరావు, పాల రాంబాబు, పొన్నపల్లి శివ, గుండు రాజా, దంపనబోయిన సత్యనారాయణ పాల్గొన్నారు.

## ప్రార్థనామందిరం కూల్చివేత దారుణం

### ఆర్‌డిఒ, సిఐపై చర్యలు తీసుకోవాలని కోరుతూ క్రైస్తవ సంఘాల నాయకుల ర్యాలీ, మానవహారం

ప్రజాశక్తి - ఉండి

నిర్మాణంలో ఉన్న ప్రార్థన మందిరాన్ని అక్రమంగా కూల్చివేసినవారిపై చర్యలు తీసుకోవాలని క్రైస్తవ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు శనివారం ర్యాలీ, రాస్తారోకో, మానవహారం నిర్వహించారు. మండలంలోని చెరుకువాడలో ప్రార్థన మందిరాన్ని అక్రమంగా నిర్మిస్తున్నారని గ్రామపంచాయతీ కార్యదర్శి కేశిరెడ్డి గోపాలకృష్ణ ఫిర్యాదు మేరకు రెవెన్యూ అధికారులు, పోలీసు అధికారులు శుక్రవారం రాత్రి జెసిబి సాయంతో కూల్చివేశారు. దీంతో శనివారం క్రైస్తవ సంఘాల నాయకులు ఉండి సబ్ రిజిస్టర్ కార్యాలయం వద్ద ఉన్న పార్క్ వద్ద నుంచి మెయిన్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి సెంటర్లో రాస్తారోకో, మానవహారం చేశారు. ఈ సందర్భంగా ఎఫ్ఎఫ్ఐసి జాతీయ అధ్యక్షులు పీటర్ పుట్ట, రాష్ట్ర అధ్యక్షులు మహమ్మద్ ఇస్మాయిల్, ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ నాయకులు మత్తే రాజ్‌కుమార్ మాట్లాడుతూ చెరుకువాడ నూతిగట్టు ప్రాంతంలో 13 సంవత్సరాలుగా తాటాకింట్లో ప్రార్థనా మందిరం నిర్వహిస్తుండగా దాని స్థానంలో గత రెండేళ్ల క్రితం చర్చి ఫాస్టర్ హేమకుమార్ నూతనంగా ప్రార్థన మందిరం నిర్మాణానికి పూనుకున్నామన్నారు. స్థానికుల అవరోధాలను ఎదుర్కొని ఇటీవల క్రైస్తవ సంఘాల నాయకుల మద్దతుతో భవన నిర్మాణ పనులు వేగవంతం చేయగా శుక్రవారం రాత్రి అధికారులు ఎటువంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా కూల్చివేయడం అత్యంత దారుణమన్నారు. ఎన్నికల సమయంలో ప్రజాప్రతినిధులు దళితుల ఓట్ల కోసం అభ్యర్థిస్తారని, కానీ తమకు ఇబ్బందులు ఏర్పడిన తరుణంలో ఏ ఒక్క ప్రజా ప్రతినిధి కూడా తమ బాధను తీర్చలేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం 20 బస్సులతో చలో అమరావతి కార్యక్రమానికి దళిత నాయకులు పిలుపునిచ్చారు. అధికారులు వచ్చి సమాధానం ఇచ్చేవరకు ఉద్యమం ఆగదని వారు హెచ్చరించారు. ఈ సంఘటనకు బాధ్యులైన భీమవరం రెవెన్యూ డివిజనల్ అధికారి దాసిరాజు, ఆకివీడు రూరల్ సిఐ గీతా రామకృష్ణలను విధుల నుంచి సస్పెండ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. ఆర్‌డిఒ, సిఐపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కలెక్టర్ పి.ప్రశాంతికి ఫిర్యాదు చేయడానికి ఉండి మెయిన్ సెంటర్ నుంచి భీమవరం కలెక్టర్ కార్యాలయానికి వెళ్లారు. కలెక్టర్ అందుబాటులో లేకపోవడంతో కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎఫ్‌సిఐ జిల్లా ప్రెసిడెంట్ స్టాన్లీ థామస్, వెల్ఫేర్ ప్రెసిడెంట్ ఐజక్ పాల్, ఉండి పాస్టర్స్ ప్రెసిడెంట్ డేవిడ్‌రాజు, జోసఫ్ రాజు, కాళ్ల ప్రెసిడెంట్ సుందరావు, పురుషోత్తం, జిల్లా సెక్రటరీ చిరంజీవి, సువార్త రాజు, ఎపిసియు నాయకులు రాజారావు, దళిత నాయకులు పాల్గొన్నారు.

క్రైస్తవ సంఘాల నాయకుల మానవహారం

ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న సోమరాజు

## ఉపాధి హామీ బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఉపాధి హామీ బకాయిలు చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కండెల్లి సోమరాజు డిమాండ్ చేశారు. మండలంలోని ఆరుగొలను గ్రామంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కండెల్లి సోమరాజు శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధి పని ప్రదేశంలో కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తమకు బకాయిలు రావాల్సి ఉందని కూలీలు తెలిపారు. అనంతరం సోమరాజు మాట్లాడుతూ మండలంలో ఇప్పటివరకు ఉపాధి పనులు అరకొరగానే ప్రారంభించినట్లు చెప్పారు. పనిచేసిన ప్రతిఫలం ఇప్పటికీ వేతనాలు రాక కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఉపాధి హామీ వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

శిక్షణ పొందినవారికి సర్టిఫికెట్ అందిస్తున్న సూర్యనారాయణరాజు

## బైర్రాజు ఫౌండేషన్ సేవలు వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - గణపవరం

బైర్రాజు ఫౌండేషన్ సేవలు ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని ఫౌండేషన్ కన్వీనర్ జంపన సూర్యనారాయణరాజు అన్నారు. కాశీపాడులో ఫౌండేషన్ ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత నెల 27న యవతకు కంప్యూటర్ శిక్షణా కోర్సు ఏర్పాటు చేశారు. శిక్షణా కాలం ఈ నెల 8వ తేదీకి పూర్తి అవ్వటంతో శిక్షణ పొందిన 70 మందికి ధ్రువీకరణ పత్రాలు సూర్యనారాయణ రాజు అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి కోట నాగేశ్వరరావు, ఉపసర్పంచి గాదిరాజు బాలరాజు, ప్రోగ్రాం మేనేజర్ చరణ్‌తేజ, కో-ఆర్డినేటర్ దుర్గాప్రసాద్, సభ్యులు పి.అజయ్‌కుమార్ రాజు, వైసిపి నాయకులు సిల్వస్టర్ రాజు, తెర్లి కృష్ణారావు, ఆరోగ్య సహాయకులు నామాలరాజు పాల్గొన్నారు.

పేరుపాలెంలో బీచ్‌లో స్నానాలు చేస్తున్న క్రైస్తవులు, పర్యాటకులు

## పేరుపాలెం బీచ్‌లో క్రైస్తవుల సందడి

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పేరుపాలెం బీచ్ క్రైస్తవులతో శనివారం కళకళలాడింది. ఏసుప్రభు శ్రమకాల దీక్ష విరమణ సందర్భంగా రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి దీక్షదారులు కుటుంబ సభ్యులతో శుక్రవారం రాత్రి తరలివచ్చారు. వేలంకిని మాత ఆలయంలో దీక్ష విరమణ చేశారు. మొక్కుబడులు చెల్లించుకున్నారు. అనంతరం సముద్ర స్నానాలు ఆచరించారు. బీచ్‌లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డిఎస్‌పి రవి మనోహరచారి పర్యవేక్షణలో సిఐలు శ్రీనివాస్ యాదవ్, సురేష్ బాబు, ఎస్ఐ ఎం.వీరబాబు, సుధాకర్ రెడ్డి, విశ్వనాథ్‌లతో సుమారు 200 మంది సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

## చినతాడేపల్లిలో 'ఫ్యామిలీ డాక్టర్'

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

వెంకట్రామన్నగూడెం పిహెచ్‌సి వైద్యాధికారి శ్రీ హర్ష శనివారం చినతాడేపల్లిలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 183 మందికి పరీక్షలు చేసి మందులు ఇచ్చారు. గర్భిణులను పరీక్షించి వారు తీసుకునే ఆహార పదార్థాల గురించి, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఐరన్, ఫోలిక్ ఆసిడ్ బిల్లలు వేసుకోవడం వల్ల కలిగే లాభాల గురించి గర్భిణులకు వివరించారు. అనంతరం అంగన్‌వాడీ సెంటర్ సందర్శించి పది మంది పిల్లలకు వైద్య పరీక్షలు చేసి వారి ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రతలపై అంగన్‌వాడీ టీచర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ఇ ఒటి వి.సత్యనారాయణ, ఆరోగ్య కార్యదర్శి లక్ష్మణరావు, క్లస్టర్ రామకృష్ణ, దివ్య, ఎఎన్ఎం ఆదిలక్ష్మి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

## పారిశుధ్య మెరుగుదలకు ప్రాధాన్యత

ప్రజాశక్తి - ఉండి

గ్రామంలో పారిశుధ్య నివారణకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎన్ఆర్‌పి అగ్రహారం ఎంపిటిసి సభ్యులు మున్నలూరి సువర్ణలక్ష్మి శ్రీనివాస్ అన్నారు. మండల పరిషత్ నిధుల నుంచి గ్రామానికి రూ.6.50 లక్షల నిధులు కేటాయించగా వాటిని గ్రామంలోని మెయిన్ విలేజ్‌లో డ్రెయినేజీ నిర్మాణానికి ఉపయోగిస్తున్నట్లు ఆమె తెలిపారు. డ్రెయినేజీ నిర్మాణ పనులను శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పుడు నూతనంగా నిర్మించబోయే డ్రెయినేజీతో మెయిన్ విలేజ్‌లో పారిశుధ్య సమస్య పరిష్కారమవుతుందన్నారు. గ్రామ అభివృద్ధికి గ్రామ సర్పంచి సూరవరపు కనకదుర్గ వెంకటాచార్యులు, పాలకవర్గ సభ్యులు ఎంతో కష్టపడుతున్నారని వారికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తానని ఆమె హామీ ఇచ్చారు.

మొగల్తూరులో రద్దీగా ఉన్న పూల దుకాణం

## పూల ధరలకు రెక్కలు

ప్రజాశక్తి - మొగల్తూరు

మార్కెట్‌లో పూల ధరలు విపరీతంగా పెరిగాయి. ఆదివారం ఈస్టర్ పండుగ కావడంతో క్రైస్తవ సోదరులు వారి కుటుంబ సభ్యుల సమాధుల అలంకరణకు శనివారం సాయంత్రం పూల కొనుగోలుకు తరలివచ్చారు. పూలకు డిమాండ్ పెరగడంతో దరలు రెట్టింపయ్యాయి. గతంలో మల్లెపూలు కిలో ధర.400 ఉండగా ప్రస్తుతం రూ.1200, బంతి కిలో రూ.100 నుంచి రూ.150, చామంతి కిలో రూ.200 నుంచి రూ.300, గులాబి కిలో రూ.120 నుంచి రూ.220, కనకాంబరాలు మూర రూ.50 నుంచి రూ.100 పెరిగాయి. పూలదండల ధరలు కూడా రెట్టింపయ్యాయి.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

## ప్రశాంతంగా ఇంగ్లీష్ పరీక్ష

ప్రజాశక్తి - పెనుమంట్ర

పదో తరగతి ఇంగ్లీష్ పరీక్ష శనివారం ప్రశాంత వాతావరణంలో జరిగాయని ఎంఇఒ డి.శారద జ్యోత్స్న అన్నారు. ఈ పరీక్షకు పెనుమంట్రలో 181 ముంది విద్యార్థులకు ఐదుగురు గైర్హాజరయ్యారని తెలిపారు. పాలమూరులో 92 మందికి నలుగురు, మార్టేరు ఎస్‌విజిహెచ్ హైస్కూలులో 127 మందికి ముగ్గురు, మార్టేరు బసంతిదేవి హైస్కూల్‌లో 125 మందికి ముగ్గురు గైర్హాజరు అయ్యారని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీస్ సిబ్బందితోపాటు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## మెగా డిఎస్‌సితో పోస్టులను భర్తీ చేయాలి

ప్రజాశక్తి - తణుకు రూరల్

రాష్ట్రవ్యాప్తంగా సుమారు 50,700 ఉపాధ్యాయ ఖాళీ పోస్టులను మెగా డిఎస్‌సి ద్వారా భర్తీ చేయాలని ఎపిటిఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి ఐ.రాజగోపాల్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాజగోపాల్ మాట్లాడుతూ ప్రతి ప్రాథమిక పాఠశాలలో కనీసం ఇద్దరు ఉపాధ్యాయులు పనిచేసేలా చూడాలని, ఉన్నత పాఠశాలలో అన్ని సబ్జెక్టులు బోధించేందుకు విద్యార్థుల సంఖ్య నిష్పత్తికి తగినట్లు అన్ని ఖాళీ పోస్టులను భర్తీ చేసి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకొనే పేద, బడుగు, బలహీన వర్గాల బాల బాలికలకు నాణ్యమైన విద్యను అందించాలని కోరారు. ప్రభుత్వం, ఉపాధ్యాయ ఖాళీ పోస్టులను కేవలం 1,179గా చూపడం సరికాదన్నారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా టెట్ పరీక్షల్లో అర్హత సాధించిన వారు సుమారు ఏడు లక్షల మంది మెగా డిఎస్‌సి గురించి ఎదురుచూస్తున్నారని రాజగోపాల్ తెలిపారు.

**In The Court Of The 2nd Addl. Junior Civil Judge Cum 2nd Addl. Judicial Magistrat of 1st Class Tadepalligudem, W.G.Dt.**
**O.S.No. 351/2022**

***Between:***
Sri Vijaya Lakshmi Speciality Cemicals, Rep. by its Proprietor Maddula Srinivasa Rao.
***...Petitioner /Plaintiff***
**AND**
M/s. Vaishanavi Impex, Rep. by its Managing Director P.Nageswara rao and 3 others.
***...Respondents /Defendants***
***Respondents /Defendants 2 and 3:***
2) M/s. Ragha Business Solutions having Its Manufacturing units at D.No. 3-149, Side Masid Rooms, Kagithala Penta, Kadapa, Kadapa District.
3) Paleti Nageswara Rao, S/o. Krishna Murthy Chowdary, Hindu, Male aged about 59 Years, M/s. Vaishnavi Impacts and M/s. Ragha Business Solutions, D.No. 1-115, Lakshminagar, H/o. Marapalli (V), Dwaraka Tirumala (M), W.G.Dt /B.M.D.

పైన తెలుపబడిన దావా, పిటీషనులో రెస్పాండెంట్సు /ప్రతివాదులు 2 మరియు 3 వార్కి శ్రీ కోర్టు వారు మిమ్ములను పైన పేర్కొన్న కోర్టుకి హాజరు కమ్మని, అనేక పర్యాయములు శ్రీ కోర్టు వారి ద్వారా పై నెంబరు దావా గ్రంథములో దావా సమన్లు పంపిననూ, మీరు ఉద్దేశ్యపూర్వకంగా తీసుకొనుటలేదు. అందుచేత శ్రీ కోర్టు వారి ఆర్డరు ప్రకారము, ఈ పేపరు ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది మీరు **ది.17-04-2023 సం॥రం తేదీన ఉదయం గం॥ 10:30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని, లాయరు గారి ద్వారా గాని పైన పేర్కొన్న శ్రీ కోర్టు వారి ఎదుట హాజరై, మీ అభ్యంతరములు తెలియపరుచుకొనవలెను.** లేని ఎడల ఎక్స్ పార్టీ చేచి మీ పరోక్షమున తీర్మానిండమగును.

***వాయిదా తేదీ: ది.17-04-2023***

**వి.వి.సాయిరామారావు**
అడ్వకేట్, ఏలూరు.
సెల్: 93953 86956
**ఎ.సుభాకరరావు**
అడ్వకేట్స్, తాడేపల్లిగూడెం.
సెల్: 94401 05513
తాడేపల్లిగూడెం,
05-04-23.

**In The Court Of The Principal Junior Civil Judge Cum Judicial Magistrat of 1st Class Tadepalligudem, W.G.Dt.**
**O.S.No. 352/2022**

***Between:***
Sri Vijaya Lakshmi Speciality Cemicals, Rep. by its Proprietor Maddula Srinivasa Rao.
***...Petitioner /Plaintiff***
**AND**
M/s. Vaishanavi Impex, Rep. by its Managing Director P.Nageswara rao and 3 others.
***...Respondents /Defendants***
***Respondents /Defendants 1 to 4:***
1) M/s. Vaishnavi Impacts having Its Manufacturing units at D.No. 1-11, Lakshminagar, H/o. Marampalli (V), Dwaraka Tirumala (M), W.G.Dt. / B.M.D.
2) M/s. Ragha Business Solutions having Its Manufacturing units at D.No. 3-149, Side Masid Rooms, Kagithala Penta, Kadapa, Kadapa District.
3) Paleti Nageswara Rao, S/o. Krishna Murthy Chowdary, Hindu, Male aged about 59 Years, M/s. Vaishnavi Impacts and M/s. Ragha Business Solutions, D.No. 1-115, Lakshminagar, H/o. Marapalli (V), Dwaraka Tirumala (M), W.G.Dt /B.M.D.
4) Paleti Padmaja, W/o. Paleti Nageswara Rao, Hindu, Female aged about 56 Years, Director of M/s. Vaishnavi Impacts and M/s. Ragha Business Solutions, D.No. 1-115, Lakshminagar, H/o. Marapalli (V), Dwaraka Tirumala (M), W.G.Dt /B.M.D.

పైన తెలుపబడిన దావా పిటీషనులో రెస్పాండెంట్సు /ప్రతివాదులు 1 టు 4 వార్కి శ్రీ కోర్టు వారు మిమ్ములను పైన పేర్కొన్న కోర్టుకి హాజరు కమ్మని, అనేక పర్యాయములు శ్రీ కోర్టు వారి ద్వారా పై నెంబరు దావా గ్రంథములో దావా సమన్లు పంపిననూ, మీరు ఉద్దేశ్యపూర్వకంగా తీసుకొనుటలేదు. అందుచేత శ్రీ కోర్టు వారి ఆర్డరు ప్రకారము, ఈ పేపరు ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది మీరు **ది.21-04-2023 సం॥రం తేదీన ఉదయం గం॥ 10:30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని, లాయరు గారి ద్వారా గాని పైన పేర్కొన్న శ్రీ కోర్టు వారి ఎదుట హాజరై, మీ అభ్యంతరములు తెలియపరుచుకొనవలెను.** లేని ఎడల ఎక్స్ పార్టీ చేచి మీ పరోక్షమున తీర్మానిండమగును.

***వాయిదా తేదీ: ది.21-04-2023***

**వి.వి.సాయిరామారావు**
అడ్వకేట్, ఏలూరు.
సెల్: 93953 86956
**ఎ.సుభాకరరావు**
అడ్వకేట్స్, తాడేపల్లిగూడెం.
సెల్: 94401 05513
తాడేపల్లిగూడెం,
05-04-23.